క్లుప్తంగా

నోవహు సువార్త పండుగలు



తెనాలిటౌన్: పట్టణ ఐతానగర్‌లోని పల్లవి గార్డెన్స్‌లో నోవహు సువార్త పండుగలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. నోవహు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ వి.ఇస్రాయేలు ఆధ్వర్యంలో సువార్త పండుగ ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రంగరాజు బైబిల్ నుంచి వాక్యోపదేశం చేశారు. ఏసుక్రీస్తు బోధనలను ప్రజలు ఆచరించాలని సూచించారు. మూడు రోజుల పాటు ప్రతి రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సభలు జరుగుతాయని నిర్వాహకులు రెవరెండ్ ఇస్రాయేలు తెలిపారు. రెవరెండ్ కె.విలియంకేరి, సంఘపెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలలో హైరిస్క్ కేసులకూ శస్త్ర చికిత్సలు



శస్త్ర చికిత్స అనంతరం నాగేశ్వరమ్మ

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో హైరిస్క్ కేసులకు శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఓ వృద్ధురాలికి గుండె పనితీరు తక్కువగా ఉన్నా విరిగిన కాలుకు శస్త్ర చికిత్స చేసి ఆమెను ప్రాణాపాయం నుంచి తప్పించారు. జిల్లా వైద్యశాల వైద్యుల కథనం ప్రకారం.. తెనాలి బీసీ కాలనీకి చెందిన తాడికొండ నాగేశ్వరమ్మ (70), ఎడమ కాలు తొడ విరిగి జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం సోమవారం వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు గుండె 20 శాతం మాత్రమే పనిచేస్తుందని గుర్తించారు. ప్రమాదం అని తెలిసిన ఆమెకు వైద్యులు తగిన జాగ్రత్తలు తీసుకుని శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె క్షేమంగా ఉందని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్స చేసిన వారిలో ఆర్థోపెడిక్ సీనియర్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు, డాక్టర్ టి.రాకేష్, మత్తు వైద్యులు డాక్టర్ మజీదబేగం, డాక్టర్ యశస్వి ఉన్నారు. విజయవంతంగా శస్త్ర చికిత్స చేసిన వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అభినందించారు.

17న కాకుమాను శంకరుని ధర్మసత్రం షాపుల వేలం

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీకాకుమాను శంకరుని ధర్మసత్రంకు చెందిన 12, 14 నెంబర్ల షాపులకు మూడేళ్ల అద్దె లైసెన్సు హక్కుకు సీల్డ్ టెండర్-కం-బహిరంగవేలం ఈనెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్టు కార్యనిర్వహణ అధికారి మండేపూడి పానకాలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు దేవదాయ, ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో జరిగే వేలంపాటలో ఆసక్తిగలవారు పాల్గొనవచ్చని వివరించారు.

చిత్రపటం బహూకరణ

తెనాలిటౌన్: మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ 32వ వర్ధంతిని మంగళవారం పట్టణంలోని ఏఎస్ఎన్ కాలేజ్ ఆవరణలో జరిపారు. ఆయన చిత్రపటానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కాలేజ్ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి తనయుడు, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు నందివెలుగు గ్రామ సర్పంచ్ దూళిపాళ్ళ పవన్‌కుమార్, అత్తోటకు చెందిన కిట్టు ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు సత్యనారాయణ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో నందివెలుగు, అత్తోటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని డాక్టర్ కేఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం తుమ్మపూడి గ్రామంలో స్వచ్ఛభారత్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో భాగంగా మూడోరోజు తుమ్మపూడి గ్రామంలో స్వచ్ఛభారత్‌పై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి టి.భవాని, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన ఉండాలి



తాడేపల్లిరూరల్: బాలల పరిరక్షణపై అవగాహన ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్ పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి రాము గోడౌన్‌లో చిన్న రైలు ఫెర్టిలైజర్స్ ముఠా యూనియన్ కార్మికులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ఆపదలో ఉన్న బాలలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో చిన్న రైలు ఫెర్టిలైజర్స్ ముఠా మేస్త్రీ ఎం.కరుణ, వి.రాజు పాల్గొన్నారు.

రైతు నాయకుడికి జేజేలు

- ఘనంగా మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ వర్ధంతి
- నివాళి అర్పించిన రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- రాజకీయపార్టీల కతీతంగా నివాళి అర్పించిన ప్రముఖులు



అన్నాబత్తుని సత్యనారాయణ చిత్రపటం వద్ద ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే శివకుమార్, వరికూటి అశోక్‌బాబు, మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి

తెనాలి: అచ్చ తెలుగు పంచెకట్టు, నిరాడంబరత, ఉన్నత వ్యక్తిత్వం, ప్రజాసేవాభిలాష కలిగిన మాజీమంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ పాటించిన జీవనవిధానం తరతరాలకు మార్గదర్శకమని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన మాజీమంత్రి, ఏఎస్ఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు అన్నాబత్తుని సత్యనారాయణ 32వ వర్ధంతిని ఆయన తనయుడు, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ఎన్ కాలేజి ఆవరణలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ అయోధ్యరామిరెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున, వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. సత్యనారాయణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ, స్వర్గీయ సత్యనారాయణ ఆదర్శజీవితం గడుపుతూ విద్యాసంస్థను స్థాపించి సమాజానికి సేవచేశారని గుర్తుచేశారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ ప్రజలను మమేకం చేసుకుని సమాజానికి మోడల్‌గా ఉండొచ్చని నిరూపించారని చెప్పారు. కౌన్సిలర్‌గా ప్రారంభించి, మున్సిపల్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, పౌరసరఫరాలశాఖ మంత్రిగా తెనాలికే కాకుండా జిల్లాకు, రాష్ట్రానికి ఎంతగానో సేవ చేశారని చెప్పారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తండ్రి ఆలోచనల్ని ముందుకు తీసుకెళుతున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్నారని తెనాలికి, జిల్లాకు ఆయన మంచి కంట్రిబ్యూషన్ కావాలన్నారు. సత్యనారాయణ ఆలోచనల్ని ముందుకు తీసుకెళ్లేందుకు శివకుమార్ నేతృత్వంలో అందరం కలసి పనిచేద్దామని సూచించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వీరికి స్వాగతం పలికారు.

తెనాలి: తెనాలిలో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజికి ఉదయం తొమ్మిది గంటలకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం నేతలు, కార్యకర్తలు, న్యాయవాదులు, వైద్యులు, వ్యాపారులు చేరుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను పలకరించి, సత్యనారాయణ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలనుంచి శ్రద్ధాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మాజీ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్, తెనాలి జెడ్పీటీసీ ఉమాప్రణతి, కొల్లిపర ఎంపీపీ పద్మావతిసంజీవరెడ్డి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సీతనగేష్‌రెడ్డి, పార్టీ తెనాలి అధ్యక్షులు మద్దాళి శేషాచలం, దుబాయ్‌బాబు, తెనాలి, కొల్లిపర మండలాల అధ్యక్షులు శ్రీనివాసరావు, పోతిరెడ్డి, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు ప్రభాకర్, నిర్మల, సుష్మ, జిల్లా మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ బాలగురవమ్మ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మీకుమారి, బిషప్ సుధీర్‌కుమార్, శ్రీవాసవీ దేవస్థానం కమిటీ కార్యదర్శి నరసింహారావు, జనసేన నాయకుడు వెంకట రమణారావు, న్యాయవాదులు శ్రీనివాసరావు, విల్సన్, మల్లికార్జునరావు, శివకోటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు శ్రీనివాసరావు, అశోక్‌యాదవ్, శ్రీనివాసరావు, రామకృష్ణ, రమేష్, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, చంటి, దుర్గాప్రసాద్, హరీష్, కిరణ్ పాల్గొన్నారు.

నివాళి అర్పించిన అధికారులు...

తెనాలి మండల తహసీల్దార్ కె.రవిబాబు, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, డీఎస్పీ బి.జనార్ధనరావు, ఆర్టీసీ డీఎం రాజశేఖర్, పట్టణ సీఐలు నివాళులు అర్పించినవారిలో ఉన్నారు.

ఎస్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

తాడేపల్లిరూరల్: ఎస్టీయూ దుగ్గిరాల మండల శాఖ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సమావేశానికి ఉన్నం ప్రసాద్ అధ్యక్షత వహించారు. సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సిహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కులకై నిరంతరం పోరాడుతూ ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటూ స్వాతంత్ర్యానికి పూర్వమే ఏర్పడి 75 సంవత్సరాలు అయిన నేపథ్యంలో మండల శాఖ వజ్రోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామచంద్రయ్య మాట్లాడారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల శాఖ నూతన అధ్యక్షుడిగా ఉన్నం ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా మునిపల్లి మోహనకృష్ణ, గౌరవాధ్యక్షులుగా మదన మనోహరబాబు, ఆర్థిక కార్యదర్శిగా షేక్ బషీర్, గౌరవ సలహాదరుగా సుధాకర్ బాబు, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.రామచంద్రయ్య, కె.వి.సుబ్బారావు, బి.బ్రహ్మయ్య, బి. మరియదాసు, ఎ.జగన్మోహన్, ఎ.రాంబాబు, షేక్ రిజ్వానా బేగం ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కె. జోజప్ప, రాష్ట్ర కౌన్సిలర్ కె.వి.సుబ్బారావు, జిల్లా బాధ్యులు బి.మరియదాసు, ఎ.జగన్ పాల్గొన్నారు. వార్షిక కౌన్సిల్ సమావేశానికి ఎన్నికల పరిశీలకులుగా ప్రశాంతరావు, ఎన్నికల అధికారిగా ఎ.వి.గోపాలరావు వ్యవహరించారు.



తెనాలిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో జరుగుతున్న చండీసహిత హనుమధీశ్వర మహాయజ్ఞంలో భాగంగా మంగళవారం స్వామివారికి లక్ష నాగవల్లీ దళార్చనలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పుష్ప దంపతులు, అన్నాబత్తుని సత్యనారాయణ - తెనాలి

రైఫిల్ షూటింగ్‌లో కేఎల్‌యూ విద్యార్థికి గోల్డ్ మెడల్



మద్దినేని ఉమామహేష్

తాడేపల్లిరూరల్: రైఫిల్ షూటింగ్‌లో ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థి మరోసారి బంగారు పతకం సాధించాడు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరి కిషోర్ వివరాలు వెల్లడించారు. విద్యార్థి మద్దినేని ఉమా మహేష్ ఈనెల 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఇండోనేషియాలోని జకర్తాలో నిర్వహించిన ఆసియా రైఫిల్ చాంపియన్‌షిప్‌లో ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో పోటీలలో పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడని తెలిపారు. యూనివర్సిటీలోని క్రీడాకారులకు ప్రత్యేకమైన వసతులను కల్పించడమే కాకుండా ప్రోత్సాహకాలను, ఫీజు రాయితీలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించిన ఉమా మహేష్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు, క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిశోర్ అభినందించారు.

ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది



కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న కిరణ్ కుమార్

కాకుమాను: కష్టాల్లో ఉన్న ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలబడుతుందని నియోజక వర్గ సమన్వయ కర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి మండల కేంద్రం కాకుమానుకు చెందిన పాగర్తి పెద కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాకుమానుకు చెందిన పాగర్తి రమణ (55) అనే మహిళ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోవడంతో తొలి విడతగా రూ.2 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఆపదలో ,సమస్యల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రమణ కుమారుడు పెద కోటేశ్వరరావుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, మెరిగల మోహనరావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే

- ప్రజా సంకల్పయాత్ర పూర్తయి ఐదేళ్ళ సంబరాలు
- ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: మాట ఇచ్చాడంటే దాన్ని అమలు చేసి తీరటంలో ఘనుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు.

మంగళవారం ఏటుకూరులోని నియోజకవర్గం కార్యాలయంలో ప్రజా సంకల్పయాత్ర పూర్తయి ఐదేళ్ళు పూర్తయిన సందర్భంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారీ కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజా సంకల్పయాత్రను చేపట్టి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినీ కలిసి వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారాల దిశగా కృషిచేసి నవరత్నాల సంక్షేమ పథకాలను ప్రకటించాడన్నారు. ఎన్నికల్లో అఖండ విజయం సాధించి ఏడాదిలోనే 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన భారతదేశ చరిత్రలో ఏకైన నాయకుడు మన జగనన్న అని తెలిపారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రెండు లక్షల మందికి ప్రభుత్వ కొలువులు అందించాడన్నారు. ప్రజలకు నవరత్నాల పథకాలు అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, జగనన్న ఆసరా, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, ఆరోగ్యశ్రీ రూ.25 లక్షలకు పెంపు, నాడు నేడు, చేనేతలకు, ఇతర వర్గాలకు వివిధ రకాల సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే అందించిన ఏకైక నాయకుడు మన జగనన్న మాత్రమేనని తెలిపారు. తమ కుటుంబంలో మంచి జరిగితేనే నాకు ఓటు వేయండి అని మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అడిగిన ఏకైన నాయకుడు మన జగనన్న అని తెలిపారు. అటువంటి జగనన్నకు మనమంతా అండగా ఉండాలని రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని గెలిపించుకుని జగనన్నకు గిఫ్ట్‌గా అందించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, యార్డ్ డైరెక్టర్‌లు, చైర్మన్‌లు, సొసైటీ చైర్మన్‌లు, వార్డు సభ్యులు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ కన్వీనర్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

- గ్రామగ్రామాన జగన్ భగీదరి కార్యక్రమాలు
- అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళి, సంతకాల సేకరణ



సామాజిక న్యాయ మహా శిల్పం చిత్రపటం వద్ద నివాళలర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రత్తిపాడు: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని పాతమల్లాయపాలెం సర్పంచ్ కాసు పద్మావతి అన్నారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జన్ భగీదరి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా మంగళవారం పాతమల్లాయపాలెంలో సర్పంచ్ కాసు పద్మావతి, ఎంపీటీసీ రమాదేవి, కొండేపాడులో నర్రా రాంబాబు, కోయవారిపాలెంలో సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, ప్రత్తిపాడులో సెక్రటరీ జాన్‌పీరాలు సామాజిక న్యాయ మహా శిల్పం చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక న్యాయ విగ్రహం ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మావతి మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు.

కత్తితో దాడి ఇరువురికి గాయాలు

చేబ్రోలు: బాకీ డబ్బులు వసూలు విషయమై జరిగిన వివాదంలో కత్తితో దాడి చేయటంతో ఇరువురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానిక చెరువులోపాలెంకు చెందిన మోపర్తి రమేష్‌కు వడ్లమూడి గరువుపాలెం ప్రాంతానికి చెందిన యువకుడితో డబ్బుల విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో చేబ్రోలు జీబీసీ రహదారి వద్ద ప్రత్యర్థులు కత్తితో దాడి చేయటంతో మోపర్తి రమేష్‌కు గాయాలయ్యాయి. అడ్డుకోబోయిన వేమూరి పవన్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు నారాకోడూరులో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపరను కొనసాగిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. జనవరి 11వ తేదీన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం శిబిరాన్ని ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో బజరంగ్ నేత్ర జ్యోతి, బజరంగ్ మీ గుండె పదిలం, బజరంగ్ దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరఫీ సేవలను ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. నేత్రజ్యోతి వైద్య శిబిరం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వారం రోజుల్లో ఉచిత కళ్లజోడు అందించటం జరుగుతుందన్నారు. మీ గుండె పదిలం ద్వారా అవసరమైన వారికి యాంజియోగ్రాములు తదుపరి గుండె సర్జరీలు చేయించటం, స్టెంట్లు వేయించటం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎవరైతే దివ్యాంగులున్నారో వారికి ఉచితంగా త్రిచక్ర వాహనం, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడు సమకూర్చటం జరుగుతుందని చెప్పారు.

ఘనంగా జన్ భగీదరి



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని శృంగారపురంలో జన్ భగీదరి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ డి.సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.అరుణ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన ఆవిష్కరించనున్నారని తెలిపారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఫ్లెక్సీలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో శృంగారపురం సర్పంచి కొండూరు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ సీఐ బాధ్యతల స్వీకారం



దశరథరామారావు

తెనాలిరూరల్: తెనాలి వన్‌టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.దశరథరామారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 1998 బ్యాచ్‌కు చెందిన ఆయన నెల్లూరు జిల్లాలోనే ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. 2016లో సీఐగా పదోన్నతి పొంది గూడూరు టౌన్, రూరల్, నెల్లూరు పోర్టు, రైల్వేలో పని చేశారు. ప్రస్తుతం రేంజ్ వీఆర్ నుంచి తెనాలి వన్‌టౌన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, డీఎస్పీ బి.జనార్ధనరావులను మర్యాద పూర్వకంగా కలిశారు. కాగా ఇక్కడ వన్‌టౌన్ సీఐగా పని చేస్తున్న కె.చంద్రశేఖర్‌ను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



పెదనందిపాడు: ఎరువుల షాపుల్లో నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పెదనందిపాడులోని మనగ్రోమోర్ సెంటర్, శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, నాగులపాడు జీడీసీఎంఎస్ కేంద్రాన్ని పెదనందిపాడు, అన్నపర్రు ఆర్బీకే సెంటర్‌లను ఆమె సందర్శించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని, అనుమతి పత్రాలు ఉన్న ఎరువులను మాత్రమే విక్రయించాలని, స్టాక్ రిజిస్టర్లు పక్కాగా మెయింటెన్ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న విధంగా స్టాక్ ఉండాలని ఆమె యాజమానులు, సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఏవో సుధారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకునికి డాక్టరేట్



కృష్ణచైతన్య

గుంటూరు రూరల్: విద్యార్థులు, అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లపుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.కృష్ణచైతన్యకు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. ఆయన అసెస్మెంట్ ఆఫ్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్ ప్రాపర్టీస్ యూజింగ్ వేస్ట్ కాపర్ స్లాగ్ యాజ్ ఫైన్ యాగ్రిగేట్ యాన్ ఎక్స్‌పెరిమెంటల్ స్టడీ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ లభించిన అధ్యాపకుని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్ శ్రీనివాస్, డాక్టర్ ఏఎస్ ప్రసాద్ తదితరులు అభినందించారు.

విజ్ఞాన్ విద్యార్థి ప్రతాప్‌రెడ్డికి పీహెచ్‌డీ



ప్రతాప్‌రెడ్డిని అభినందిస్తున్న వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థి అంబవరం ప్రతాప్‌రెడ్డికి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. 'ఇన్వెస్టిగేషన్ ఆన్ బ్యాండ్‌విడ్త్ అండ్ గేన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఆఫ్ మైక్రోస్ట్రిప్ ప్యాచ్ యాంటినా ఫర్ వైమ్యాక్స్-5జీ-డబ్ల్యూలాన్ అప్లికేషన్స్' అనే అంశంపై ప్రతాప్‌రెడ్డి పరిశోధన చేశారని తెలియజేశారు. ఆయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పచియానన్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అంబవరం ప్రతాప్‌రెడ్డిని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.